క్లుప్తంగా

బాధితులను ఆదుకోవడం అభినందనీయం



కొల్లూరు : ప్రమాదాల్లో బాధితులను ఆదుకోవడం అభినందనీయమని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. శుక్రవారం కొల్లూరులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో రేపల్లె రెడ్‌క్రాస్ సంస్థ అగ్ని ప్రమాదంలో నివాస గృహాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు అందజేసిన సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ దేవినేని మల్లికార్జునరావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, కమ్మెల సాంబయ్య, కనపర్తి మోహన్‌రావు, అయిల సుబ్బారావు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

రేపల్లె రూరల్: ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదం చేస్తోందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణానికి చెందిన చిట్టూరి ప్రసాద్‌కు రూ.25 లక్షల చెక్కును అందజేశారు. వివిధ గ్రామాల లబ్ధిదారులకు రూ.25 లక్షల విలువైన చెక్కులు అందించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసులు అందజేత

చింతాయపాలెం(కర్లపాలెం): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ తెలిపారు. కర్లపాలెం మన గ్రోమోర్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ సత్తార్ చేతుల మీదుగా చింతాయపాలెం హైస్కూల్ విద్యార్థులకు 400 స్టీలు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీడీఏ విజయనిర్మల, ఏడీఏ ఎ.లక్ష్మి, ఏవో సుమంత్‌కుమార్, కోర మండల్ జనరల్ మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.

ఎంఈఓకు ఆత్మీయ సన్మానం

చుండూరు(వేమూరు): కష్ట పడి పని చేసే ప్రతి ఉద్యోగినీ ప్రభుత్వం గుర్తిస్తోందని ఎంపీపీ జాలాది రూబేను తెలిపారు. చుండూరు ఎంఈఓగా పని చేస్తున్న చీకటి రవి కాంత్ గణతంత్ర దినోత్సవం నాడు ఉత్తమ విద్యాశాఖధికారిగా అవార్డు అందుకున్న సందర్భంగా ఉపాధ్యాయులు మండల విద్యా వనరుల శాఖ కార్యాలయంలో శుక్రవారం సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పి రెడ్డి, వేమూరు ఎంఈఓ కాజా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖి అమ్మవారి ఆలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన వైభవంగా నిర్వహించారు. వివాహ దోషనివారణ హోమం నిర్వహించారు. ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లల కోసం ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చన నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నటుడు దర్భా బాబూరావు మృతి

బాపట్ల: ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల రిటైర్డు కామర్స్ అధ్యాపకులు, రచయిత, కవి, నటులు, చిత్రకారులు దర్భా బాబూరావు (78) గురువారం రాత్రి గుంటూరు హాస్పిటల్‌లో మరణించారు. బాబూరావు మరణానికి ఫోరం ఫర్ బెటర్ బాపట్లతోపాటు పలువురు సంతాపం తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బాపట్ల అర్బన్: చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంఈఓ నిరంజన్ చెప్పారు. డెటాల్ బనాయేగా స్వస్థ ఇండియా వారి డేటాల్ స్కూల్ హైజని ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా శ్రద్ధా గ్రామాలయ ఆధ్వర్యంలో ఏబీఎం హైస్కూల్‌లో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

మనోహరం

- ముస్తాబైన శైవక్షేత్రాలు
- ప్రారంభమైన కల్యాణోత్సవాలు
- మార్మోగుతున్న పంచాక్షరి మంత్రం

రేపల్లె: మహాశివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలు మనోహరంగా ముస్తాబయ్యాయి. కొన్నిచోట్ల కల్యాణోత్సవాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మోర్తోట గ్రామంలోని ముక్తేశ్వరస్వామి ఆలయం శివరాత్రి పూజలకు సిద్ధమైంది. కృష్ణానది చెంతనే ఈ ఆలయం ఉండడంతో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శిస్తారు. ఈ ఆలయానికి పురాతన చరిత్ర ఉంది. కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి ఇక్కడికి భక్తులు తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఈ నెల 18న శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామికి అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు జగజ్యోతి, మహాదీపారాధన, రాత్రి 7.15 గంటలకు స్వామి కల్యాణం, అన్న సంతర్పణ కార్యక్రమం జరగనున్నాయి. 19వ తేది ఆదివారం స్వామి గ్రామోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ముస్తాబైన మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి ఆలయం

ముక్తేశ్వరుని ఆలయానికి విరాళం

రేపల్లె : మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయంలో అన్నసంతర్పణ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు రూ.లక్ష విరాళంగా శుక్రవారం అందజేశారు.

మోపిదేవి ప్రత్యేక పూజలు

నిజాంపట్నం: నిజాంపట్నం శివాలయంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షులు కన్నా శ్రీనివాసరావు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్ పాల్గొన్నారు.



నిజాంపట్నం శివాలయాన్ని సందర్శించిన ఎంపీ మోపిదేవి

● ఉత్సవ శోభ



భట్టిప్రోలు మండలంలోని పలు శివాలయాలు ఉత్సవ కాంతులతో శోభిల్లాయి. విద్యుద్దీప ధగధగల్లో మెరిసిపోయాయి. మహాశివుని మనసారా కీర్తించేందుకు సిద్ధమయ్యాయి. పెదపులివర్రులోని రాజరాజ నరేంద్రస్వామికి నెమలి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆ గుడితోపాటు, ఓలేరులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, కొల్లూరు మండలం కోటిపల్లిలోని సోమశేఖరస్వామి దేవస్థానం ఇలా మహాశివరాత్రి పండుగ వేళ వెలుగులీనుతూ కనువిందు చేశాయి.





లింగోద్భవ స్వామీ నమో..

పిట్టలవానిపాలెం: చందోలులోని లింగోద్భవ స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో శనివారం తెల్లవారు జామున మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించడంతోపాటు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సాలిగ్రామ శివలింగాన్ని పాండవులు ప్రతిష్ఠించినట్లుగా ప్రతీతి.



పాండవులు ప్రతిష్ఠించిన శివలింగాన్ని, అలంకరిస్తున్న అర్చకులు

వెల్లటూరులో కల్యాణోత్సవాలు ప్రారంభం



భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులోని బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వరస్వామి గంగా పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల త్రయాహ్నిక దీక్షా దివ్య కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్వామిని పెండ్లి కుమారుడిని చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పులకించారు.

గోవాడ, అరవపల్లి తిరునాళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు



బాలకోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి

చెరుకుపల్లి/రేపల్లె: మహాశివరాత్రి సందర్భంగా గోవాడ, అరవపల్లి బాలకోటేశ్వర స్వామి వార్ల తిరునాళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి తెలిపారు. చెరుకుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల జిల్లా, రేపల్లె డివిజన్ ఆవిర్భావం తర్వాత తొలి తిరునాళ్ల కావడంతో భక్తుల సౌకర్యార్థం సకల వసతులు కల్పించినట్టు వివరించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసు శాఖతో చర్చించి ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ప్రజలు ప్రశాంతంగా స్వామిని దర్శించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ నిరన్‌జన్ బాబు పాల్గొన్నారు. అనంతరం అరవపల్లిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని ఆర్డీఓ సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కర్లపాలెం: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. కర్లపాలెం మండలం గణపవరంలో శుక్రవారం ఎమ్మెల్యే కోన రఘుపతి అధికారులతో, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. సంబంధిత బ్రోచర్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పథకాలేవీ అందేవి కాదని, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవరకొండ అంకమ్మ, ఎంపీటీసీ సభ్యులు దిండి నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ జి.కృష్ణమూర్తి, సొసైటీ చైర్మన్ పెద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గణపవరంలో జరిగిన గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి, పార్టీ నాయకులు

రేపల్లె పట్టణాభివృద్ధికి ప్రత్యేక కృషి

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. ఓల్డ్‌టౌన్-అరవపల్లి రహదారి విస్తరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించి అధికారులతో చర్చించారు. త్వరలో ఓల్డ్‌టౌన్ -పేటేరు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం పట్టణంలోని రెండో వార్డులో లూథరన్ చర్చిలో రాజ్యసభ సభ్యుని నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న హాలుకు శుక్రవారం మోపిదేవి వెంకట రమణారావు శంకుస్థాపన చేశారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బాపట్ల డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ప్రశాంత్‌కుమార్, కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న మోపిదేవి

● జై భజరంగ 'భళీ'

వైభవంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవం

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ దేవత కట్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా 8వ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్వామికి భక్తులు విశేష అభిషేకాలు, సహస్రనామ, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామానికి చెందిన ముకుంద కోలాటం బృందం ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. పూజా కార్యక్రమాల్లో కాటూరి సాంబయ్య, నంబూరి గిరిధర్ దంపతులు పాల్గొన్నారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. స్వామికి అర్చకులు క్రోవి రామకృష్ణ శాస్త్రయుక్తంగా పూజలు చేశారు. భక్తులకు 11 రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు.



విశేష అలంకారంలో శ్రీ అభయాంజనేయ స్వామి

మంత్రి నాగార్జునపై విమర్శలు తగవు

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున విశేష కృషి చేస్తున్నారని, ఆయనపై కొందరు విమర్శలు చేయడం తగదని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి చెప్పారు. భట్టిప్రోలు ఏఎంసీలో వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కొల్లూరులో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రిపై కొందరు చేసిన వ్యాఖ్యలు అర్థ రహితమని చెప్పారు. మంత్రి నాగార్జున లంక భూముల రైతులకు శాశ్వత పట్టాలు ఇప్పించి న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పెదలంక, పల్లెకోన ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, దున్నా తిరుపతిబాబు, ఓలేరు సర్పంచ్ మేరుగ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు కట్టిపెట్టాలి

కొల్లూరు : మంత్రి నాగార్జునపై అసత్య ఆరోపణలను కట్టిపెట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి కూచిపూడి మోషే సూచించారు. శుక్రవారం కొల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన వేమూరు ఎంపీపీ యల్లమాటి మోహన్, కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంత్రిపై విమర్శలను ఖండించారు.